# పాపం ప్రకాశం

డి. కామేశ్వరి

మెయిలు అరగంట ఆలశ్యంగా వచ్చి ఆగింది. థర్డ్‌క్లాస్ స్లీపర్ కంపార్టుమెంటు దగ్గర గుంపుని తోసుకొని ముందుకెళ్ళి తనబెర్తు నెంబర్ చూచుకుని కంపార్టుమెంటులోకి ప్రవేశించాడు ప్రకాశం.

నెంబరు వెతుక్కుంటూ వెడ్తున్న ప్రకాశం ఒక్కసారిగా ఏదో భూతం ప్రత్యక్షమైనట్టు ఒక అడుగు వెనక్కి వేశాడు కమలని చూసి. కమల! ఛెళ్లున చెంప దెబ్బ తగిలినట్టు మొహం త్రిప్పేసుకున్నాడు కమలని గుర్తుపట్టి.

అతని సీటు కమలకి ఎదుట సీటే అవడంతో అతనిగాభరా మరికాస్త ఎక్కువయి ఏం చెయ్యాలో తోచక కంగారు పడి పోయాడు.

ఆదే క్షణంలో చదువుతున్న పుస్తకం లోంచి తలెత్తి ప్రకాశాన్ని చూసింది కమల. ఆమె మొహంలో రంగులు గబగబ మారాయి. క్రింది పెదవి పంటితో నొక్కి ప్రకాశం వంక తీక్షణంగా చూసింది. మరు క్షణం ఆమె పెదాల మీద ఓ చిరునవ్వు కదిలింది.

ఆ వ్యంగ్యపు చిరునవ్వు చూచిన ప్రకాశరావుకి వళ్ళు కంపర మెత్తింది. రుమాలు తీసి మొహం చాటు చేసుకున్నాడు తుడుచుకునే నెపంతో! ఆ తర్వాత ఏం చెయ్యాలో తోచక చేతిలో సూటుకేస్ చటుక్కున సీటు క్రిందకు

త్రోసి గబగబ కంపార్టుమెంటు నించి దిగి ప్లాట్ఫాం మీదనిలబడ్డాడు. అప్పటికి కాస్త ఊపిరి అందినట్టయింది అతనికి.

ఛా....యీవిడగారేమిటి యిలా తటస్థపడింది?....ఖర్మకాక పోతే ఆవిడ సీటుకి ఎదుటి సీటు కావాలా తనది? సీటు మార్చేసుకుంటే బాగుండును. రైలు కదిలాక కమలకి ఎదుటి సీటులోనే కూర్చోక తప్పలేదు ప్రకాశానికి. కూర్చుంటూ తనకి తాను ధైర్యం చెప్పుకున్నాడు. ఛా.... యీమెకు భయపడడం ఏమిటి తిడ్తుందా కొడ్తుందా? మొగాడ్నినే నిలా బెదరడం ఏమిటి అనుకుంటూ కమల వంక ధైర్యంగానే చూశాడు కూర్చుంటూ.

ప్రకాశం కమలని చూడగానే కళ్ళెగరేసి గుర్తించానులే అన్నట్లు ఓ నవ్వు విరిసిన కమలని చూసి ఆ ధైర్యానికి విస్తుపోయాడు. ప్రకాశం గుర్తుండక ఏమవుతాడు!? పట్టుమని ఏడాదన్నా కాలేదు చూసి!

కమల ధైర్యం సంగతి తెలియడం యిదేం మొదటి సారికాదు ప్రకాశంకి. ఆ రోజు...ఆరోజు ఆమె ధైర్యం ఎలాంటిదో స్వయంగానే చూశాడు. ఎంత ధైర్యం లేకపోతే.... పెళ్ళి చూపుల కొచ్చిన పెళ్ళికొడుకుని, పెళ్ళికూతురు నచ్చింది. కట్న కానుకల సంగతి మాట్లాడు కుందాం అన్న పెద్దలందరూ వుండగా తిరస్కారంగా పెళ్ళికొడుకు వైపుచూసి మీతో ఓ ఐదు నిమిషాలు మాట్లాడాలి అభ్యంతరం లేకపోతే ఆగదిలోకి రండి అంటూ ఆహ్వానిస్తుందా? తెల్లబోయి చూస్తూన్న పెద్దలందరిని నిర్లక్ష్యంగా చూసి పెళ్ళికొడుకుని గదిలోకి తీసి కెళ్ళి మర్యాదగా కూర్చోమని చెప్పుతూనే నీవు ఎమ్మే చదివావు. నేనూ ఎమ్మేని. నీకంటె దేన్లో తక్కువని నేను నీకు కట్నం యివ్వాలి? ఐదారొందలు తెచ్చుకుంటున్నావు ఇలా బిచ్చపెళ్ల డబ్బుకి ఆశ పడడానికి నీకేం పౌరుషం లేదా అంటూ అడుగుతుందా? చదువు సంస్కారం వుందనుకునే ఓ సంస్కారం యింతేనా అని సవాల్ వేస్తుందా? అమ్మ. నాన్న చెల్లి పెళ్ళి అయినా సంజాయిషీ ఈయబోయే పెళ్ళికొడుకుని మరింత తిరస్కారంగా చూసి ఆమాట అనడానికి మీలాంటి యువకులు సిగ్గుపడాలి. అమ్మ

---

**కాలం మారింది—అంటూకూడా పూరాతన ఆచారాన్ని మరువలేక కట్నాలు ఆశించి అమ్ముడు పోయే చదువుకొన్న తెలివి హీనులు కళ్లు తెరిచిననాడే కాలం పూర్తిగా మారుతుంది! స్త్రీని సమానంగా గుర్తించటం జరుగుతుంది!**

---

నాన్నల వెనక దాక్కోనే మీ పిరికితనం చూసి ఆడపిల్ల మిమ్మల్ని పెళ్ళాడదు అవి కుండ బద్దలు కొట్టినట్లు అంటుందా? నీ లాంటి పెళ్ళికొడుకు లందరూ కట్నం తీసుకోంఅనుకుంటే చెల్లెలి పెళ్ళని కట్నం అనే వంక అందగా వుంటుందా? కోపం తెచ్చుకొని ఆడదానివిగాదూ నీకింత అహంకారం వుంటే నీకీ జన్మకి పెళ్ళి కాదు. మొగాడ్ని నిలబెట్టి యిలా ప్రశ్నించే ఆడదానిని నిన్నెవరు పెళ్ళాడుతారు అన్న పెళ్ళికొడుకు కోపానికి బెదరక పోగా.... ఓ వ్యంగ్యపు చిరునవ్వు పారేసి నీలెక్క ఏమిటి అన్నట్టు చూస్తుందా? నీవు కాక పోతే మరోడు ఎవడూ లేకపోతే యిలాగే వుంటాను. కాని కట్నం తీసుకొని అమ్ముడు పోయే నీలాంటి వాడిని చస్తే పెళ్లాడను అంటుందా? పట్టరాని కోపంతో విసవిస వెళ్లి పోయే పెళ్ళికొడుకుని వెనక్కి పిలిచి సరే కట్నం ఇస్తాను. కాని నేను గీచిన గీత దాటకుండా నా కను సన్నలలో మెలుగుతావా మరి నిన్నే నేను కొనుక్కుంటున్నాను గదా అంటుందా? బుసలుకొడ్తూగదిలోంచిబైటకి వెళ్ళపోయే పెళ్ళికొడుకు వెనక నవ్వు తుందా!....యింత ధైర్యమా ఆడపిల్ల కింత తెగువా అని పెళ్ళికొడుకు పళ్లు పిండుకు టుంటే ధైర్యంగా ధిక్కారంగా హేళనగా చూస్తూ విసవిస లోపలికి కెళ్ళి పోతుందా?

ఏడాది క్రితం జరిగినది గుర్తువచ్చి మళ్ళీ ఓసారి పళ్లుపిండుకున్నాడు ప్రకాశం. మరీసారి కమల వంక చూసేసరికి యీ పారి నవ్వుతూ సూటిగా అతని కళ్ళ లోకి చూస్తోంది కమల.

"మర్చిపోయారా నన్ను....గుర్తుపట్ట లేదా?" కమల అడిగింది. ఆడదాని కింత ధైర్యం ఏమిటబ్బా అనిమరోసారిఆశ్చర్య పోయాడు ప్రకాశం.


"ఆ....ఆ....గుర్తెందుకు లేదు...." అన్నాడు ఆక్వర్డ్‌గా నవ్వుతూ.

"అవునవును ఎలా మర్చిపోతారు లెండి! అంది కవ్విస్తున్నట్టు.

ఇది ఆడపిల్లగాదు బాబూ ఓ రాక్షసి గానే అనిపించింది కాస్త తీక్షణంగానే చూశాడు కమలవంక. నీకోపానికి నేనేం బెదరనులే అన్నట్టు కమల మళ్ళీ నవ్వింది.

"పెళ్ళి చేసుకున్నారా? కట్నం ఎంత పుచ్చుకున్నారు?" చాలా చనువుగా పెద్ద పరిచయస్తురాలుగా అడుగుతున్న కమల చూపులని తప్పించుకుంటూ తల అడ్డంగా ఊపాడు. జవాబు చెప్పకూడదు. చెప్ప నవసరం లేదు. అనుకున్నా ప్రకాశం తనకి తెలియకుండానే తల తిప్పాడు.

"అదేం?..." మహా ఆశ్చర్యకర మైన సంగతి విన్నట్టు ఆశ్చర్యం నటిం చింది కమల. 'అదేం' అంటే ఏం జవాబు చెప్పలేదు ప్రకాశం! మొగాడన్న వాడికి మెడమీద తలకాయ వున్నవాడకి అందులో చదువు, ఉద్యోగం వున్నవాడికి




పెళ్ళిచేసుకోడానికి చూస్తున్న వాడికి ఓ సంవత్సరం పెళ్ళికాక పోవడమా? సంభంధాల కేం కొదవ కనీసం ఓ అర డజను అమ్మాయిలని చూసి వుంటారు పిల్లనచ్చితే కట్నం నచ్చక కట్నం నచ్చితే పిల్లనచ్చక ఇలా ఒకటినచ్చి మరోటి నచ్చక ప్రకాశానికిఇంకా వివాహం కాలేదు. చూసిన అరడజను అమ్మాయిలలో ముగ్గురు పిల్లలు నచ్చిన కట్నం యీయలేక వెనక్కి తగ్గిన వారే అంచేత అదేం అన్న ప్రశ్నకి జవాబు యీయలేక ప్రకాశం తల తిప్పుకుని వూరుకున్నాడు.

కమల కాసేపు వూరుకుంది. ప్రక్కన ఇద్దరు ముగ్గురు వీళ్ళద్దరి సంభాషణని ఇంటరెస్టింగ్‌గా వినసాగారు. ప్రకాశం అది గమనించి ఆడపిల్ల తనని పట్టుకొని అలా నిలేసినట్టు ప్రశ్నిస్తుంటే తను చవట దద్దమ్మలా వూరుకోడం ఏమిటి అనిపించింది.

పౌరుషంగా తలెత్తాడు ప్రకాశం. కమల వంక సూటిగా చూశాడు.

"మరీ మీరు? ... కట్నం కోరకుండా వచ్చి ఎవరన్నా పెళ్ళాడారా మిమ్మల్ని? చాలా వ్యగ్యంగా ఘాటుగా అడిగానను కొని సంతోషిస్తూ జవాబు చెప్పమన్నట్లు చూశాడు ప్రకాశం. పెళ్లయిన గుర్తులు అంటే నల్ల పూసలు, మట్టెలు, మంగళ సూత్రం వగైరాలు ఏవీ కనబడలేదు ప్రకాశానికి. మెళ్లోఏదో బంగారు గొలుసు వుంది. కాని కట్టుకున్న చీర దళసరది అవడంవల్ల మంగళసూత్రం వుందో లేదో కనబడలేదు

ప్రకాశానికి. అంచేత పెళ్లి అయివుండదని తీర్మానం చేసుకొని, ఆ... ఎవడు యీ విడ గారి ఆశయాలన్ని ఆమోదించి పెళ్లాడుతాడు అని నిబ్బరంగా అనుకొని, ఈవిడిగారి గర్వం అణిచే ప్రశ్న వేశానని సంతో షిస్తూ జవాబు చెప్పమన్నట్టు చూశాడు ప్రకాశం.

కమల ఒక్క క్షణంలో సగం సేపు మాత్రం కలవరపడి వెంటనే తడబాటు అణచుకుంటూ, మెరుస్తున్న కళ్ళతో నవ్వుతూ ఏదో పరధ్యానంగా వున్నట్టు 'ఆఁ... ఏమిటడిగారు' అంది. ''అదే మీకు పెళ్ళయిందా? అయితే, మీ షరతు లన్నీ అమలులో పెట్టే పెళ్ళాడారా అని అడుగుతున్నాను!''

"ప్చ్.... లేదండీ! పెళ్ళెలా అవుతుంది చెప్పండి?'' విచారం నటిస్తూ అంది కమల.

''ఏం?....'' అన్నాడు అర్థం కాక ప్రకాశం.

''ఏం, ఏమిటి అని నన్నడగడం ఏమిటి? మీ మగాళ్ళ గురించి నాకంటే మీకే బాగా తెలియాలి గదా!'' అంది

ప్రకాశం మొఖం వికసించింది.... విజయగర్వం తొణుక్కున అతని మొహం మీద మెరిసింది. ''చూశారా? యిప్పుడైనా వప్పుకొంటారా? నేను ఒక్కడినే లోక విరుదమైన కోరిక కోరలేదని యిప్పటి కయినా గ్రహించారా? అందరూ కోరే కోరికలని మీరేదో పెద్ద ఆశయం అంటూ తిరస్కరిస్తే నష్టం ఎవరికో గ్రహిం చారా?'' అన్నాడు.

కమల అదోలా నవ్వింది. ''ఆ నష్టం ఏదో భరించగలను లెండ నేను.... ఇంతకీ నేను నష్టపోయానని అనుకోవడం లేదు లెండి'' అంది.

ప్రకాశానికి ఏం జవాబీయాలో తెలి యక వూరుకున్నాడు.

''అదిసరే గానీ ఎక్కడికి బయలు దేరారు? ఎక్కడిదాకా ప్రయాణం? కమలే మళ్ళీ సంభాషణ ఆరంభించింది.

''విజయవాడ దాకా....'' అన్నాడు ప్రకాశం ''ఆహా అలాగా నేనూ విజయవాడ కుమండీ. పనిమీద బయలుదేరారా?'' అంది ''చచ్చాం చివరివరకు యీవిడి గారితో ప్రయాణము తప్పదు. ఎదురుగా కూర్చో డం అది తప్పదన్నమాట అని కాస్త బెంగపడ్డాడు ప్రకాశం. పెళ్ళి చూపులకి వెడుతున్నాను,'' అని చెప్పదలచ లేదు. ప్రకాశం అంచేత ...'' ఆ.... పనేలెండి అన్నాడు ముభావంగా.

తరువాత సంభాషణ సాగలేదు. కమల మళ్ళీ పుస్తకం తెరిచింది. పేజీ పేపరు తెరిచి మొహానికి అడ్డం పెట్టుకొని మధ్య మధ్య కమలని దొంగతనంగా చూస్తూ ఆలోచిస్తున్నాడు. ప్రకాశం కమలని చూస్తూంటే....యీ అమ్మాయిని కట్నం



కోసం తను వదులుకొని పొరపాటు చేయలేదుగదా అన్న వూహ ప్రవేశించింది. అతనికి అతను చూసిన అరడజను అమ్మాయిలలో కమల్లాగా అన్నీ కుదిరి బాగున్న అమ్మాయే కనపడ లేదు అతనికి. ఒక అమ్మాయి పొట్టి మరో అమ్మాయి పీలగ వూపిరిలేనట్టు మరో అమ్మాయికి అడ రూపమే లేదు. మరో అమ్మాయికి మీసాలు మరో అమ్మాయి నల్లగా వున్న మొహం పిండాగంట్లు ఇలా తనుచూసిన అమ్మాయి లందరూ కళ్ళముందు నిలిచి వాళ్ళ మధ్య కమలని ఊహిస్తే రంభలాగే కన్పించ సాగింది. కుటుంబం మంచి వెడాహోదా అమ్మాయి అందం చదువు చందం అన్నీ నచ్చి కేవలం కట్నం కోసం వెనక్కి తిరిగి పోవడం తను తప్పు చేయలేదు గదా? అన్పించ సాగింది. ఏడాది నుంచి చూస్తూన్నా కమల మాదిరి సంబంధం ఏది కనపడ లేదు. ఒకరిద్దరు ఓ మాదిరిగా నచ్చినా వాళ్ల తమ కట్నం అంకె చూసి వెనక్కి తగ్గారు. ఈ వరస చూస్తుంటే సంబంధాలు వెతుకుతూ చూస్తూండటం వగైరా ఇంక కాస్త చిరాకుగానే వుంది ప్రకాశానికి. ఆ చిరాకు యిప్పుడు కమలని చూసిన మరి కాస్త ఎక్కువయింది. కమల ధైర్యం కమల చలాకీ తనం ముందు వాళ్లు మందించినా యిప్పుడెందుకో ఆ ధైర్యం మెచ్చతగింది గానే కన్పించసాగింది కమలని చూస్తున్న కొద్ది. ఛా....చెల్లెళ్ళ పెళ్ళి బాధ లేకపోతే యీ కట్నం గొడవ లేకపోతే హాయిగా యీ అమ్మాయిని పెళ్లాడేసే వాడిని కదా అనుకున్నాడు. అసలు కమల అన్నట్టు తనెందుకు పుచ్చుకోడం. చెల్లెళ్ళ కెందుకు యీయడం....ఏమిటో యీవలయం.... ఛా....అమ్మా నాన్న....చెప్పినా వినరు. అర్థం చేసుకోరు....ఎలా యీ గొడవల్లో వేగడం. యీ సమస్యకి పరిష్కారం ఏమిటో....

ఆలోచించి ఆలోచించి ప్రకాశానికి చిరాకనిపించింది. ఈ కమల యీ కమలని గురించి తనిలా ఆలోచించడం ఏమిటి? యీ అమ్మాయి తప్ప తనకింకెవరూ పెళ్ళాడడానికి దొరకరన్నట్టు బెంగపడడం ఏమిటీ? ప్రకాశంలోని పురుషాహంకారం మళ్ళీ తలెత్తి అతన్ని మందలించింది. ప్రకాశం ఆలోచనల్లో వైజాగ్ స్టేషను రావడమె గుర్తించలేదు. కంపార్టుమెంటులోకి నలుగురమ్మాయిలు బిలబిలలాడుత్తు కిలకిల నవ్వుతూ సీటు దగ్గరకే వచ్చి పెట్టెలు బెడ్డింగులు క్రిందకు తోసే హడావిడిలో ప్రకాశం మెలుకువ తెచ్చుకుని చూశాడు. వచ్చిన నలుగురమ్మాయిలు కమల సీటు మీద ఇద్దరు కూర్చుని గల గల మాట్లాడేస్తున్నారు. చచ్చాం యీ ఆడ మళయాళం మధ్య పడ్డాను ఏమిటా అను కున్నాడు ప్రకాశం. ఫరవాలేదు. అమ్మాయిల కంపెనీ యింటరెస్టుగానే వుండచ్చు అని మళ్ళీ తృప్తిపడ్డాడు.

తరువాత ఓ పావుగంట వరకు

అమ్మాయిలందరూ కమల కలిసి ఎక్కడెక్కడికి వెళ్తున్నదీ. ఏం చేస్తున్నదీ వగైరా కుశల ప్రశ్నలు అడుక్కుంటూంటే ఆ కబుర్ల మీద ఇంటరెస్ట్ లేక పేపరు తెరిచి చదవడంలో మునిగాడు ప్రకాశం.

వాళ్లు గలగల మాట్లాడు కుంటున్న కొంతసేపటికి పెళ్ళిళ్లు, కట్నాలు వగైరా ముక్కలు చెవిలోపడి పేపరడ్డం పెట్టుకునే ఓ చెవి అటువుంచాడు ప్రకాశం.

''మొన్న ఓ మంచి తమాషా జరిగింది లెండి, మా శశిని చూడ్డానికి ఓ పెళ్ళికొడుకు వచ్చాడు ఇంజనీరు. ఆరొందలు జీతం. అమ్మాయి అబ్బాయికి నచ్చింది. కట్నం పదివేలు లాంఛనాలు రెండు వేలు కావాలి పెళ్ళిబాగా చెయ్యాలి వగైరా కోరికలు బయటపెడుతుంటే శశి ఏం చేసిందో తెల్సా గబుక్కున లేచి ''నీకు నేను నచ్చానే మోగానీ. నీవునాకు నచ్చలేదు. యింక మాట్లాడకుండా వెళ్ళండి'' అందిట. తల్లితండ్రులుభయంతో వారిస్తూ ఏదో అంటూంటే మీరూరుకోండి నాన్నగారూ, వాళ్ళకిచ్చే పన్నెండు వేలు పెళ్ళిఖర్చు మరో పదివేలు యీ డబ్బంతా బ్యాంకిలో వేసుకుంటే వడ్డీతోనే నా బ్రతుకు గడపచ్చు. నన్ను పోషించేందుకుగా ఆ డబ్బు వాళ్ళకిచ్చుకోడం అంత పెళ్ళాన్ని పోషించలేని మగాడ్ని నేను డబ్బిచ్చుకుని పెళ్ళాడక్కర లేదు మరింక వెళ్ళమనండి అంది వాళ్ళ మొఖాలలో నెత్తురుచుక్క లేదుట....'' ఓ అమ్మాయి గట్టిగా నవ్వుతూ అంది.

''మరే. యీ మధ్య యిలాంటి సంబంధం నాకూ వచ్చింది. నేను నా చదువు అందం చందం నచ్చాయిట. మా నాన్న ఇచ్చేకట్నమే నచ్చలేదట. కనీసం పది వేలయినా యీయక పోతే చేసుకునేది లేదు. అనిరాశారు, ఎలాగో మా నాన్న అంత యీయలేడు. ఎలాగో యీ పెళ్ళి కాదు. అంచేత ఓ ఇరవై పేజీల ఉత్తరం పెళ్ళికొడుకుని దులిపేస్తూ ఘాటుగా

## డైజెస్టివ్ సిస్టమ్

● ''డిటెక్టివ్ నవలా పఠనంలో నేను ఎక్కువ సారాన్ని అందుకుంటాను-'' అన్నాడొకడు,

''ఎట్లా?''

''నేను పుస్తకం మధ్యనుంచీ చదవటం మొదలుపెడతాను. అందువల్ల పుస్తకం ఎలా పూర్తయిందా అనే ఆరాటంతోపాటు. ఎలా మొదలైందో నన్న ఆరాటంకూడా ఉంటుంది.''

రాసి పడేశాను. నీలాంటి వెధవని పెళ్ళాడడం కంటె నేనిలా వుండడమే ఆనందం అంటూ రాశాను. పెళ్ళికొడుకు గారు మొహం మాడ్చుకుని నాన్నకి చూపించుకున్నాడట ఆ ఉత్తరం. ఆ నాన్నేమో మా నాన్నకి ఆడపిల్ల యింత బరితెగిస్తుందా మీ పిల్లకి మరి యీ జన్మలో పెళ్ళికాదు అంటూ రాశాడు. మా నాన్న నన్ను తిట్టారనుకో అయినా వాళ్ళకి శాస్తి చేశానని సంతోషించాను...." మరో అమ్మాయి గర్వంగా అంది.

వాళ్ళమాటలు వింటూంటే ప్రకాశం శరీరం కుచించుకు పోసాగింది. కమల మొహం ఎక్కడ చూడాల్సి వస్తుందోనని పేపరు దించలేదు. కొంపదీసి యీ కమల కూడా తన అనుభవం చెప్పేసి. యీ ప్రబుద్ధుడే అని అందరికి చూపించదు గదా అని భయపడ్డాడు. అను కున్నంతా అయింది. కమల చెప్పడం ఆరంభించింది. ప్రకాశంకి చెమటలు పట్టసాగాయి. గాభరాగా పేపరు తీసి కమల వంక చూశాడు. కమల కొంటెగా ప్రకాశం వంక చూసి నవ్వింది. కాసేపు ప్రకాశం అవస్థ చూస్తూ వినోదిస్తూ కధ పూర్తి చేసింది. తనని వేలెత్తి చూపనందుకు ప్రకాశం రిలీఫ్‌గా నిట్టూర్చి మనసులోనే కృతజ్ఞతలు చెప్పుకున్నాడు ప్రకాశం.

"యిలాగే చెయ్యాలండీ, మనలాంటి అమ్మాయిలం అందరం కలసి ఈ విధంగా బుద్ధి చెబితేకాని యీ మగాళ్ళు మారరు. యీ కట్నాలబెడద పోదు. మనం యిస్తున్నన్ని రోజులు చక్కగా పుచ్చుకుంటారు. లాభంలేదు. యీ నాటి ఆడపిల్లలు కట్నాలిచ్చి పెళ్లిళ్ళు చేసుకోరు. అని వాళ్ళకి అర్థం కావాలి. అప్పటికిగాని దారికిరారు. లేకపోతే యింతింత చదువుకుంటున్నాం. ఉద్యోగాలుచేస్తున్నా. అన్నింట్లో వాళ్ళతో సరిసమానంగా వున్నా యిలా కట్నాలేమిటి? యిన్నేసివేలు పుచ్చుకుని ఆడపిల్లల తలిదండ్రులని పీడించడం ఏమిటి దీనిఅంతు ఏదో మనలాంటి వాళ్ళమే చూడాలి....ఓ అమ్మాయి చాలా ఆవేశంగా అంది.

"అందరం కూడబలుక్కున్నట్టు ఈయడం మానేస్తే, యీ మగాళ్ళు ఎన్నాళ్ళు పెళ్ళిళ్ళు మానేస్తారో చూద్దాం" మరోఅమ్మాయి అంతకంటే ఆవేశంగా అంది,

"చదువుకుంటున్నాం. ఏదో ఉద్యోగం చేసుకొని బ్రతకలేకపోం. యీ కట్నాల బాధతగ్గేవరకు మనలా అమ్మాయిలందరం కట్నమిచ్చి చస్తే పెళ్ళాడం అన్న శపథం చేసుకుంటే యిప్పుడు కాకపోయినా మరో ఐదారేళ్ళకేనా యీ గొడవ తగ్గుతుంది."

"అసలు మన అమ్మలు. నాన్నలని అనాలి. ఆడపిల్ల యింట్లోవుంటే, వూరికే బాధ పడిపోయి, భయపడిపోయి ఎలాగో వదుల్చుకోవాలన్న ఆత్రంతో ఎంతడిగితే

అంతఅపో్పసపో్ప చేసి కట్నాలీయడం అలవాటు చేశారు. మరి పుచ్చుకునేవారు వాళ్ళెందుకు పుచ్చుకోరు? ప్రతీయింట్లో ఆడపిల్లలు యీ కట్నాల దురాచారాన్ని నిర్మూలించాలి. అవసరమైతే తల్లిదండ్రులకి నచ్చచెప్పాలి. లేకపోతే తిరగబడాలి. అందరూ కలిసి ఓ త్రాటిమీద నడిస్తే ఈ సమస్యకి అసలు తావేవుండదు.

"అవును. అమ్మాయికిస్తున్నాం. మరి అబ్బాయికి పుచ్చుకోకపోతే ఎలా అండం ప్రతీయింట్లోనూ వింటున్నాం. అబ్బాయికి పుచ్చుకోం. అమ్మాయికీయం. ఇద్దరికీ చదువులు చెప్పిస్తాం. కట్నాలీయం. తీసుకోం. పెళ్లికాకపోయినా వాళ్ల బ్రతుకులు బ్రతికే చదువు చెప్పించాం. మన బాధ్యత తీరిపోయిం. అని ప్రతి తల్లీ తండ్రి అనుకుంటే అసలు యీ గొడవే వుండదుగా..."

"అలా అనుకోకపోబట్టే గొడవ. మన మనుష్యులకి ఎప్పటికి పరివర్తన వస్తుందో గదా. అమ్మాయికి యీయడం. అబ్బాయికి పుచ్చుకోడం అన్నీ విషవలయంలో పెట్టుకుంటూనే తిరుగుతున్నారు కాని. ఆ వలయాన్ని ఛేదించుకు రావాలని ఎవరూ అనుకోకపోవడం ఆశ్చర్యం...."

"ఆ వలయాన్ని ఛేదించే శక్తి సామ


ఫోన్: 551

డా: పి. కుమారస్వామి దేవర

ట్రావెలర్స్ బంగళారోడ్డు, తెనాలి (ఎ. పి)

బ్రాంచి: 9-D, శివాజీ స్ట్రీట్, మద్రాసు-17

దీర్ఘరోగులకు ఉత్తమ వైద్యము



హస్తప్రయోగం, అంగము చిన్నదగుట, సంభోగకాలమందు అకస్మాత్తుగా కృశించుట శుక్ల నష్టము, నపుంసకత్వము, (ఒక డోస్‌తో ఎన్నడూ కనివిని ఎరుగనంత వీర్యస్తంభనకల్గిహాయినిచ్చును. అసంతృప్తి చెందు స్త్రీ, పురుషులు వాడతగినది.

(స్వప్నులు) ఉబ్బసము. (దమ్ము) బోదకాళ్ళు, కుష్టు, బొల్లి చర్మవ్యాధులు. కడుపులో నొప్పి, చెవుడు. పోస్టుద్వారా గ్యారంటీ చికిత్స చేయబడును

ర్థ్యాలు, ధైర్య సాహసాలు మన పెద్ద వాళ్ళకి లేకపోయినందుకు మన యువ తరమే దీనికి పూనుకోవాలి.

"హియర్, హియర్...." చప్పట్లు కొట్టారు అమ్మాయిలు.

కంపార్టుమెంటంతా ఆ నలుగురు అమ్మాయిలు కమల మాటలతో చైతన్యం పుంజుకున్నట్టు అయింది. వాళ్ళ మాటలని వింటూ వాళ్ళకి సపోర్టుచేస్తూ అందరూ ఒకేమాట అంటున్నది. ఆ మాటలతో వాదనలతో అంతా గోలగా తయారైంది.


ఆ మాటలతో, గోలమధ్య పకాశంకి చెమటలు పట్టి, ఊపిరి ఆడనట్టు అనిపించింది. అందరూ వేలెత్తి తననే చూపుతూ అంటున్నట్టు కలవరపడ్తూ సిగ్గుపడిపోతూ కమల మొహంకేసి చూడలేకపోయాడు. అందుకే కమల ఒక్కొక్క వ్యాఖ్యానం మధ్య-మధ్య విసురుతూ.. కొంటెగా, హేళనగా ప్రకాశం వైపు చూసి నవ్వుతూంది. అదంతా భరించలేక ప్రకాశం చటుక్కున సీటులోంచి లేచి తలుపు దగ్గరకి వెళ్ళి నిలబడ్డాడు. ఆ తరువాత మరి కాసేపు ఇంకెవరి బెర్తుమీదో వెళ్ళి కూర్చున్నాడు. అక్కడికి కూడా అమ్మాయిల వాగ్ధోరణి, వాళ్ళ ఆవేశం, వాళ్ళ మాటలు, వాళ్ళ నిర్ణయాలు అన్నీ విన్పిస్తూనే వున్నా ఎదురుగా ముఖాముఖి తటస్థ పడకుండా తప్పించుకుని తేలిగ్గా ఊపిరి పీల్చుకున్నాడు ప్రకాశం. ఆ మాటలన్నీ వింటున్న ప్రకాశం 'బాబోయ్ యీ ఆడపిల్లలు.... ఈనాటి ఆడపిల్లలు తెలివి మీరుతున్నారు. వీళ్ళతో నెగ్గలేం బాబూ!' అనుకున్నాడు. వీళ్ళు అన్న మాటలన్నీ ఆచరణలో పెట్టేస్తారా ఏమిటి చెప్మా? అన్పించింది వాళ్ళ ఆవేశం చూస్తే! వాళ్ళు చెప్పుకున్న నాలుగయిదు సంఘటనలు విన్నాక. కమల మొదలయిన అమ్మాయిలు పెళ్ళికొడుకులకి కట్నం యీయం అని ధిక్కరించటం విన్నాక ప్రకాశంలో ఏదో కలవరం బయలుదేరింది. ఆ తర్వాత చాలా సేపు అలా ఆలోచిస్తూ కూర్చున్నాడు

ఏలూరులో ఆ నలుగురు అమ్మాయిలు దిగి వెళ్ళాక తుఫాను వెలిసినట్టు అన్పించింది ప్రకాశానికి. మళ్ళీ వెళ్ళి తన బెర్తు మీద కూర్చున్నాడు. "ఎక్కడికి వెళ్ళిపోయారు ఇందాకటినింగీ?" నవ్వుతూ అడిగింది' కమల.

"అలా ...అక్కడ కూర్చున్నాను."

"ఎం, అంత బోర్ కొట్టిందా మా సంభాషణ మీకు. నాకు మాత్రం భలే కాలక్షేపం అయింది లెండి. ఆ నలుగురమ్మాయిలు మంచి కంపెనీ యిచ్చారు."

"ఏం కంపెనీలో గానీ నాకు మాత్రం పరమ బోరు కొట్టింది. పెద్ద ఏదో ఊడబొడిచేవారిలా ఎంత పెద్ద కబుర్లు చెప్పారు ఆచరణలో పెట్టినా, మానినా నిర్ణయాలు మాత్రందాలాఆవేశంగాచేసేసుకున్నారు." హేళనగా నవ్వాడు.




''ఏం, ఆచరణలో పెట్టలేమన్న అనుమానం మీకెందుకు వచ్చిందీ?'' నుదురు చిట్లించింది కమల.

''ఎందుకొచ్చిన కబుర్లండీ! కట్నాలు, ఈ ఆచారాలు, అలవాట్లు ఒక రోజులో పొమ్మంటే పోతాయా? ఎవరో నలుగురు మీలాంటి వాళ్ళు ఆవేశంగా అరిచినంత మాత్రాన....'' వ్యంగ్యంగా అన్నాడు. ''కట్నాలు యీయక తప్పదు, పెళ్ళాడకా తప్పదు ఎలానో... ఎన్నాళ్ళు పెళ్ళిళ్ళు-పెటాకులు లేకుండా వుండగలరు యీ ఆడవాళ్ళు....''

''ఆఁ-ఆఁ....అదే మేమూ అంటున్నాము. కట్నాలీయకపోతే ఎన్నాళ్లు మీ మగాళ్ళు మాత్రం పెళ్ళిళ్ళు మానేసి కూర్చుంటారో చూద్దామనే మేమూ అనుకుంటున్నాం....'' దృఢంగా అంది కమల తిరస్కారంగా చూస్తూ. ''అయినా మీలాంటి చదువు-సంస్కారం వున్న యువకులు యిలా కట్నాలని సపోర్టు చేస్తూ మాట్లాడడం చాలా ఆశ్చర్యంగా వుంది. పెద్దలంటే, కాదని ధిక్కరించాల్సిన మీరే యిలా మాట్లాడుతూంటే- మరింక యీ దేశం బాగు పడేది, యీ మనుష్యులు మారేది అబద్ధమే లెండి'' కఠినంగా అంది కమల.

ప్రకాశరావు కాస్త తికమకపడి సర్దుకున్నాడు. బలవంతంగా నవ్వాడు. ''నేను జనరల్‌గా చెప్పమన్నాను గాని, ఇవన్నీ నా అభిప్రాయాలే అని గాదు .. మీరూ

"నేనూ ఏదో అనుకున్నంత మాత్రాన ఒక్క రోజులో యిలాంటి ఆచారాలు, అలవాట్లు పోవు అంటున్నాను అంతే!" సంజాయిషీ యిస్తూ సమర్థించుకున్నాడు.

"ఎవరి సంగతో మీకెందుకు? మీరు మీ సంగతి ఆలోచించుకోండి, అందరూ అలా ఎవరి సంగతి వారు చూసుకుంటే, కొన్నాళ్ళకీ సమస్య దానంతట అదే పరిష్కారం అవుతుంది గదా?"

'ఏమిటో లెండి. మీ రన్నంత సులువుగా యీ విషయం తేలిపోతుందనుకోలేకపోతున్నాను....'

కమల తరువాత ప్రకాశరావుతో వాదన పెంచకుండా ముభావంగా ఏదో పుస్తకం చదువుకుంటూ కూర్చుంది. విజయవాడ స్టేషను దగ్గరపడుతున్నకొద్ది ప్రకాశంకి ఏదో గాభరా ఎక్కువయింది. అతని మనసు ఆ కాసేపటిలోనే ఏవేవో నిర్ణయాలు చేసుకుని కమలతో ఏదోచెప్పాలన్న ఆరాటం మొదలైంది అతనిలో! కాని అతను తన మగఅహంవిడిచి, అంత తేలికగా చెప్పలేక తటపటాయిస్తూ, ఓ ప్రక్క టైము గడిచిపోతుందని గాభరా పడిపోతూ ఎటూ తేల్చుకోలేక అవస్థ పడటం ఆరంభించాడు. విజయవాడ స్టేషన్ సమీపిస్తుంటే ఆగలేకపోయాడు ప్రకాశం. గొంతు సవరించుకున్నాడు. కమలవైపు చూశాడు. కమల అదేం పట్టనట్టు స్టేషన్ సమీపిస్తుందని సామాను సర్దుకోవడం ఆరంభించింది.

"చూడండీ!" అన్నాడు ఆఖరికి ప్రకాశం ధైర్యంచేసి. కమల తలఎత్తి అతనివంక ఆశ్చర్యంగా, ప్రశ్నార్థకంగా చూసింది.

"మీరు... మీరు .... మీ రెక్కడుంటున్నారు ప్రస్తుతం?" ఒకటి చెప్పబోయి మరోటి అడిగాడు గాభరాగా.

"ఎందుకో?"

"అబ్బే....ఏం లేదు లెండి .... మీ ఎడ్రసు ఓసారి యిస్తారా?"

"నా ఎడ్రసా? ఎందుకు? ఎందుకో జవాబు చెప్పలేక పోయాడు ప్రకాశం. నోటితో ఎదురుగా చెప్పలేని విషయం ఉత్తరంద్వారా అయితే సులువుగా రాయవచ్చని అతను అనుకున్నాడు. ఆవిషయం కమలకి ఏంచెప్పాలో అర్థంకాలేదు.

"అబ్బే....ఏం లేదులెండి మీ కో విషయం రాయా లనుకుంటున్నాను...." అని అనడానికి చాలాసేపే పట్టింది ప్రకాశంకి. కమల చిత్రంగా చూసింది.

"నా కో విషయం రాస్తారా? మనిషిని ఎదురుగాఉండగా చెప్పకుండా, తరువాత ఉత్తరం ఎందుకు? ఆ చెప్పేదేదో యిప్పుడే చెప్పచ్చుగా!"

"ఆ .... ఆ....ఏం లేదు లెండి ." అన్నాడు ప్రకాశం తడబడుతూ.

"ఫరవాలేదు చెప్పండి" కమల అతన్ని అతనిగాభరాని కుతూహలంగా గమనిస్తూ.

అంది. ప్రకాశం మాట్లాడలేదు. ఒక్క నిమిషం. రైలు స్లో అవుతున్న కొద్దీ ప్రకాశం ఆత్రుత వేగంఅవసాగింది ఈ ఒక్కక్షణం జారిపోతే మళ్ళీ ఛాన్సు దొరకదు. ఈ అవకాశాన్ని వృధా పుచ్చితే చాలా నష్టపోవలసి వుంటుందని అతని మనసు హెచ్చరించసాగింది.

ఒక్కొక్క ప్లాట్ ఫారం వెనక్కి వెడుతూంటే....ఆఖరికి కమలవైపు చూడకుండానే ప్రకాశం...."మీకు నా అభిప్రాయం మార్చుకున్నానన్న సంగతి ఉత్తరం రాద్దామనుకున్నాను. అంతకంటె ఏం లేదులెండి...."

కమల విచిత్రంగా చూసింది. "ఏం అభిప్రాయం?"

"అదే .... అదే .... ఏడాది క్రితం మిమ్మల్నిచూశాక....మీ అభిప్రాయం.... అదిప్పుడు మార్చుకున్నాను...."

కమలకి నిజంగానే అర్థం కాలేదు, అతను చెప్పదలచింది ఏమిటో! "నా కర్థం కాలేదు. మీరనేదేమిటి....?"

"కమలగారూ! అప్పటి నా మాట వెనక్కి తీసుకున్నాను. మీ కభ్యంతరం లేకపోతే యిప్పుడు నా కేం అభ్యంతరం లేదు...."

కమలకి కాస్త అర్థమయింది విషయం. ఆమెమొహం ఎర్రబరుచుకుని అభ్యంతరం లేకపోతే....దేనికి? ప్రశ్నార్థకంగా చూస్తూ ఆగిపోయింది.

"మీకు అభ్యంతరం లేకపోతే....ఇదివరకటి కట్నం అభ్యంతరం లేకుండా మిమ్మల్ని వివాహం చేసుకుంటాను....

రైలు స్లో అయి ఆగింది. రైల్లో గోల. ప్లాట్ ఫారంమీద సందడి. తొక్కిడి మధ్య ఆత్రుతగా ప్రకాశం కమల మొహంలో భావాలు వెదుకుతూ జవాబు కోసం ఆరాటంగా ఎదురుచూశాడు. కమల మొహం ఒక్కక్షణం సిగ్గుతో ఎర్రబడింది. ఆ వెంటనే ఆమెకళ్ళలో కొంటెతనం మిలమిల లాడింది. మరోక్షణం కనుబొమ్మలు ముడిచి ఆలోచించింది. ఆ తర్వాత ప్రకాశంవంక తిరిగి నవ్వుతూ ...."సారీ....ప్రకాశంగారూ....మీ కంత శ్రమ, మీ కంత కష్టం అవసరం లేదులెండి. నాకు పెళ్ళయింది. ఐతే మీతో

## ఏజ్ లిమిట్ ?

"నా వయస్సు యాభై; రా పిల్లవయసు పద్దెనిమిది. ఆమెను పెళ్ళి చేసుకోవాలనుకుంటున్నాను. నావయస్సు తగ్గించిచెప్తే బాగుంటుందంటావా?" అని అడిగాడొక మహాధనికుడు తన స్నేహితుణ్ణి.

"అవసరం లేదు....బాగా పెంచి ఏ డెబ్భైఏళ్లు చెపితే ఆమె మరింత సుముఖత చూపితీరుతుంది" అన్నాడా స్నేహితుడు.

పెళ్ళవలేదని అన్నాను వూరికే.... క్షమించండి....'' అంటూ కూలీని కేక వేస్తూ కంపార్టుమెంటునుంచి దిగిపోయింది.


ప్రకాశం ఎలా పెట్టెపట్టుకుని ఎలా దిగి ప్లాట్‌ఫారం మీద విలబడ్డాడో అతనికే తెలియదు! అతని మనసు శరీరం అవమానంతో కోపంతో కుతకుత లాడ సాగింది. ఎంత ఫూల్ అయ్యాడు! ఎంత చవటదద్దమ్మ అయ్యాడు. ఓ ఆడదాని ముందు! ఎందుకింత తొందరపడి లోకువ అయిపోయాడు! తనకి పెళ్ళవడానికి ఆడదే దొరకనట్లు కమల ముందు వెధవలా దొరికి పోయాడు. అతని మగ అహం అవమానంతో మండిపడుతూంది. కమల అదేం పట్టనట్టు సామాను దింపించుకుంటూంది.

''హల్లో, కమలగారూ! మీరు ట్రైనులో వచ్చారా? ''అంటూ ఎవరో అతను కమలని పలకరిస్తే అటు చూశాడు ప్రకాశం కమల నవ్వుతూ జవాబిస్తూంది ''ఆ ...మీ రెందుకు స్టేషనికి వచ్చారు? ఎవరన్నా వస్తున్నారా ఏమిటి?'' కమల అడిగింది రామారావుని.

''అవునండీ. మా చెల్లెల్ని చూడడానికి పెళ్ళికొడుకు యీ ట్రైనులో వస్తున్నాని రాశాడు. అతన్ని వెతుకుతున్నాను. ఫోటో చూశాను చూసిన .. వెతకాలి అదిగో అక్కడున్నతనే అనుకుంటూను వస్తా .. తర్వాత కలుసుకుందాం ..'' అని అతను ప్రకాశం వైపు నడిచాడు. కమల ఆశ్చర్యంగా చూసింది. వాళ్ళిద్దరూ మాట్లాడుకుని మళ్ళీ ఇటూవస్తూ రామారావు కమల దగ్గిర ఓ నిమిషం ఆగాడు. ''ఈయనే నే వెతుకుతున్నది'' అన్నాడు ''ఈయనా మీ పెళ్ళికొడుకు?'' అంది కమల ఇంతసేపూ ఇద్దరం ఒకే కంపార్టుమెంటులోనే ప్రయాణం చేశాం అంది కమల అదోలా నవ్వి. ప్రకాశం సిగ్గుగ యిబ్బందిగా కదిలాడు.

అయితే మీకు పరిచయం అయ్యారన్నమాట యీయన....'' ఆ....ఆ.... అంతకు ముందే పరిచయం వుందిలెండి. అయితే రామారావు గారూ మీ చెల్లెలికి ఏ మాత్రం కట్నం యిస్తారేమిటి?'' ఉడికిస్తున్నట్టు నవ్వుతూ అడిగి ప్రకాశం వైపు చూసింది. ''ఇంకా కట్నాల దాక ఎక్కడొచ్చాం. ముందు చూపులవాలి నచ్చకం అవాలిగా....'' ''ఆ....నచ్చక ఏం చేస్తుంది లెండి మీ చెల్లెలు ...పది వేలు మూటకట్టి వుంచితే రెడీగా! అంది భావగర్భితంగా నవ్వి. రామారావు ప్రకాశం ఏం అనుకుంటాడోనని ఇబ్బందిగా కదిలితే ప్రకాశం రామారావు ఇదంతా విని ఏమనుకుంటాడోనని మరింత ఇబ్బంది పడ్డాడు

''ఆ వస్తానండి. తర్వాత మాట్లాడుకుందాం ... అంటూ రామారావు ప్రకాశంతో ముందుకు కదిలాడు. కమల




నవ్వుతూ ప్రకాశం వంక తిరిగి "విష్ యూ ఆల్ ది బెస్ట్" అంది.

"ఆవిడని .... ఆమెని మీకు ఎలా తెలుసు? ప్రకాశం రామారావుని అడిగాడు త్రోవలో.

"ఆవిడ మా కాలేజిలోనే లెక్చరరుగా పనిచేస్తున్నారు?"

"లెక్చరరా....ఆమె పనిచేస్తుంటే ఆవిడ భర్త ఏం చేస్తారు?"

"భర్త ఏమిటి, ఆ విడ కింకా పెళ్ళి కాందే?" రామారావు కాస్త ఆశ్చర్యంగా అన్నాడు.

తెల్లబోయాడు ప్రకాశం.... "నిజం? నిజంగా పెళ్ళికాలేదా?...." అత్యాశ్చర్యంగా అడిగాడు.

"అబ్బే లేదండీ, పెళ్లి అయితే తెలియదా? ఈ మధ్యనే ఆరేడు నెలలే అయింది ఉద్యోగంలో చేరి మా చెల్లెలికి లెక్చరరు కూడా నాకూ బాగా పరిచయం వుంది ఆవిడతో. ఆవిడకి పెళ్ళి కాలేదంటా ఏం అలా అడుగు తున్నారు?"

"అబ్బే ... అబ్బే ... ఏం లేదులెండి వూరికే అడిగాను...." అన్నాడు తడబడ్తూ.

ప్రకాశం అంతా ఆశ్చర్యంగా అర్థం కానట్టు అనిపించింది' కమల యింకా పెళ్లి కాలేదని నిజం చెప్పి తరువాత పెళ్లి అయిందని ఎందుకబద్ధం ఆడిందో ఎంత ఆలోచించినా అర్థం కాలేదు ప్రకాశానికి.

కానీ ప్రకాశం రామారావు చెల్లెల్ని కట్నం అక్కరలేదని పెళ్ళాడానికి యిష్టపడ్డానని రామారావు చెప్పినప్పుడు కమల ఏం ఆశ్చర్యపోలేదు. అలా ప్రకాశం ఎందుకు ప్రవర్తించాడో కమలకి బాగానే అర్థం అయింది. 'పాపం ప్రకాశం' అనుకుంటూ నవ్వుకుంది.